

భళ్ళమూడి నందకిషోర్

అది ఒక అందమైన లోకం.

ఆహా! దేవకాంతల నాట్య విన్యాసాలతో కన్నుల పండుగచేసే ఆ కాంతల లావణ్యం- ఆ మేని హొయలు మనసు నెంత పరవశింప చేస్తున్నాయి. నిత్యం మదిర గ్రోలుతూ- మధురమైన గాన కళాకోకిలల నాట్యాన్ని తిలకిస్తూ, ఆ లోకంలో అష్టదిక్పాలకులు అనుభవిస్తున్న ఆనందం వర్ణనాతీతం. అతిలోక సుందరీ మణులారా- ఆపకండి నటరాజ కౌశల్యాన్ని- ఆపకండి గానామృతాన్ని......

టక్...టక్...టక్. ఆ శబ్దం ఎక్కడిది?

అమరలోక సుఖాన్ని కనులారా చూస్తుంటే, నా ఆనందాన్ని పాడు చేయకండి... అయ్యో! సుందరాకారులారా- ఆగిపోయారేం? మరొక్కసారి మన సారా ఆడి-పాడండి......

దబ్...దబ్...దబబ్

కనుల ముందు దృశ్యం కరిగిపోయింది.

ఎవరో తలుపులు బాదుతున్నారు... ఆత్రంగా...ఆగకుండా...!

ఒక్క ఉదుటన మంచంపైన లేచి కూర్చుని కనులు నులుముకున్నాను. ఎంత చక్కని కల పాడైంది. మళ్ళీ ఆ కమనీయ దృశ్యం చూడగలనా?! తలుపులు తెరవకపోతే విరిగేట్లున్నాయి కొద్దిసేపటికి అనుకుంటూ, మంచం దిగి టైం చూశాను. అర్ధరాత్రి ఒంటిగంట అయ్యింది. ఈ సమయంలో తలుపులు బాదే అవసరం ఎవరికుంది?!......

"బాబూ! చక్రధరం...తలుపు తియ్

నాయనా!"

ఎవరిదో ఆడ గొంతుక. చాలా బేలగా ఏడుస్తున్నట్లుంది స్వరం.

ఒక్క గెంతులో వెళ్ళి తలుపులు తెరిచాను. ఎదురుగా అనసూయమ్మగారు!!

'అనసూయమ్మగారూ... ఏ...?' నా మాట పూర్తికానివ్వలేదు.

"బాబూ! హ...హ...హత్య జరిగింది. అమ్మాయి"... చెప్పలేకపోతోం దావిడ- కంగారు- భయం... ఏం జరిగిందో చెప్పనీయటంలేదులా ఉంది.

"కంగారు పడకండి! నెమ్మది... నెమ్మదిగా చెప్పండి!"

"హత్య ఏమిటి? ఎక్కడ జరిగింది?" అన్నాను. ఆమెను ఓదార్చాను గాని హత్య అనగానే టెన్షన్ పెరిగిపోయింది రోమాలు లేచి నిలబడ్డాయి

అనసూయమ్మగారు దుఃఖాన్ని ఆపుకోలేక పవిటకొంగుని నోట్లో కుక్కుకుని నా చేతినందుకుంటూ దారితీసింది.

ఆ పరిస్థితిలో కాళ్ళూ-చేతులూ వణికాయి.

మేం ఇరువురం అనామిక గదిలోకి అడుగుపెట్టాం.

అక్కడ దృశ్యం చూసి కొయ్యబారిపోయాను.

రక్తం మడుగులో అతను చచ్చిపడి ఉన్నాడు. అనామిక బిగుసుకుపోయిన కొయ్యబొమ్మలా కుర్చీలో కూలబడి ఉంది. అనామిక ఎడం చేతిలో పొడవైన కత్తి! నాకు నోటమ్మట మాట రావటం లేదు. నాలిక ఎండి పిడచకట్టుకుపోయింది. అనసూయమ్మ గారింటిలోనికి రావటం ఇదే మొదటిసారి- ఆమెకు ఉన్న ఒక్కగానొక్క కూతురు అనామిక గదిలో...!

కొద్ది క్షణాలకు తేరుకున్నాను-మనసు స్వాధీనంలోకి వచ్చింది.


"అనసూయమ్మగారు!? అసలు జరిగిందేమిటో చెప్పండి!" అన్నాను.

"ఏమో నాయనా! నాకూ తెలియదు ఏం జరిగిందో!" దుఃఖంతో గొంతు పూడుకుపోయి. అగాధంలోంచి మాట్లాడినట్లుగా వస్తోంది. ఆగని అశ్రుధారల నాపుకుని...

"దాహం వేసి నీళ్ళు త్రాగుదామని లేచాను. ఇంటి లోపల లైట్లు వెలుగుతూ కనిపించింది 'అనామీ! ఇంకా నిద్రపోలేదుటే' అంటూ లోనికి వచ్చాను ఇదిగో ఇపుడున్న స్థితిలోనే ఉంది. మాటా-పలుకూ లేదు" వెక్కుతోంది ఏడుస్తూనే!!

"అనామికా! మిస్ అనామికా! మిమ్మల్నే..." దగ్గరగా వెళ్ళి పిలిచాను. పెడల్పాటి కళ్ళను నిశ్చలంగా ఉంచి నా ముఖంలోకి చూసింది. అనామిక అలా చూస్తూ ఉండిపోతే నా వెన్నులోంచి వణుకు పుడుతోంది.

"ఎవరైనా వచ్చారా లోపలికి? ఈ హత్య ఎలా జరిగింది?" ఆత్రంగా




అడిగాను. తల వాల్చుకుంది.

"నేనే చేశాను" క్షీణంగా అంది అనామిక.

నెత్తిమీద పిడుగు పడినట్లు- ఉన్న చోటునే కుప్పకూలి పడిపోయింది అనసూయమ్మ.

అనామికకు అప్పుడు వచ్చిందిలా ఉంది పూర్తి తెలివి "అమ్మా" అంటూ చేతిలో కత్తిని వదిలేసి తల్లిని కుదుపుతోంది- ఓ ప్రక్క ఏడ్చేస్తోంది.!

"అనామికా! జరిగిందేమిటో వివరంగా చెప్పండి!" అనగానే...

"దయచేసి ఏమీ అడగకండి! ప్లీజ్!" రెండు చేతులూ ముఖాన్ని కప్పుకుని ఏడుస్తోంది హృదయ విదారకంగా.

ఏమడిగినా చెప్పే స్థితిలో లేదు. ఒక ప్రక్క అనసూయమ్మగారు అపస్మారక స్థితిలో ఉన్నారు.

వేగంగా ఇంటికి వచ్చి- పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాను.

ఆ పరిస్థితుల్లో అంతకంటే ఏం చెయ్యాలో తోచలేదు మరో పది హేను నిమిషాల్లో పోలీసులు రావటం- వారి తతంగం పూర్తిచేసుకోవటం ఇరుగు-పొరుగు నిద్రలేవటం జరిగిపోయాయి. అనామిక పోలీస్ ఇనస్పెక్టర్ అడిగిన ఒక్క ప్రశ్నకూ సరైన జవాబు ఇవ్వలేదు. అనామికను అరెస్ట్‌చేసి తీసుకుపోయారు. శవాన్ని అంబులెన్స్‌లో ఎక్కించి మార్చురీకి పంపారు. పోలీసుల అనుమతి లేనిదే ఆ గదిలోకి ఎవరిని పంపవద్దని హుకుం జారీ చేశారు. అంతకు ముందునుంచీ అప్పటివరకూ ఏం జరిగిందీ, జరిగినట్లుగా స్టేట్‌మెంట్ వ్రాసి సంతకం చేసిన కాగితాన్ని ఇనస్పెక్టర్‌కు ఇచ్చాను.

అందమైన కల వెనుక ఊహించని కథ జరిగిపోయింది.

మరునాడు ఏ పేపరు చూసినా ఇదే వార్త! దావాలనంలా వ్యాపించింది నగర మంతా. పగలంతా ఎవరో ఒక ఆఫీసర్ రావటం- అనసూయమ్మగారిని- నన్ను ప్రశ్నలడగటం- వెళ్ళడం జరుగుతూనే ఉంది. అనసూయమ్మగారి దుఃఖం చూసి నాకు కళ్ళలో ఊరిపోతున్నాయి నీళ్ళు!

అనామిక హత్య చేసిందా? నో! నెవ్వర్. ఏదో జరిగింది. ఏం జరిగిందో తెలియటం లేదు. బట్! అ నా మి క మాత్రం ఈ హత్య చెయ్యలేదు... చెయ్యలేదని ఘోషిస్తోంది హృదయం! అనామిక నిర్దోషి! ఎందుకో ఏ కారణాల వల్లనో నిజం దాస్తోంది!! ఆ నిజం ఎలా బయల్పడుతుంది? ఎవరున్నారు?.. ... తీవ్రంగా ఆలోచించి, ఆలోచించి మెద డంతా వేడెక్కిపోయింది. అసహనంగా టీపాయ్‌మీదున్న న్యూస్‌పేపర్ 'ఏకన మిక్ టైమ్స్' చేతిలోకి తీసుకున్నాను.

అందులో "సింహళీయులు తమిళు లపై జరిపిన దారుణ హత్యకాండకు 'ఎమ్నెస్టీ' ఖండన" అన్న వార్త దగ్గర ఆగిపోయాయి కళ్ళు.

క్షణకాలం మెరుపులా మెరిసింది మెద డులో ఆలోచన.

'ఎమ్నెస్టీ ఇంటర్నేషనల్' భారత దేశపు విభాగానికి అధ్యక్షురాలు ప్రత్యూష. అవును! ఈ పరిస్థితుల్లో అనామికను ప్రత్యూష తప్ప మరెవరు రక్షించగలరు? ప్రత్యూష వ్యక్తి కాదు, ఒక శక్తి అనొచ్చు. అంతేకాదు భారతదేశంలో మరో 'కోహినూర్' వజ్రం లభించిం దన్న పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంది.

'థేంక్ గాడ్! అనామికను రక్షించ టానికి మంచి తరుణోపాయం చూపిం చావు, మనసులోనే దైవానికి వేలవేల నమస్సులర్పించాను.

ప్రత్యూష ఎప్పుడైతే మదిలో మెది లిందో మనసు తేలికపడింది. వెంటనే ఫోన్ ఎత్తి నంబర్ డయల్ చేశాను. ఎంగేజ్ సౌండ్ వినిపించడంతో దిస్క నెక్టు చేసి, టెలిఫోన ఎక్స్ఛేంజ్‌కు రింగ్ చేస్తే లైన్స్ సరిగాలేవనే సమాధానం వచ్చింది. డామిట్! ఎంత అత్యవసర మనుకుంటామో అప్పుడే మరింత ఆలస్యం జరుగుతుంది. క్షణం కూడా ఆల సించక పోస్టాఫీస్‌కు వెళ్ళి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఇచ్చాక గాని మనసు స్థిమిత పడలేదు. తిరిగి వచ్చేస్తూంటే అనసూ యమ్మగారు మదిలో మెదిలారు. వెంటనే వెనుతిరిగి ఇంటికో టెలిగ్రాం ఇచ్చాను.

అనసూయమ్మగారికి తోడుగా అమ్మను ఉంచితే కాస్త ధైర్యంగా ఉంటుంది. అదే విషయం అవిడతో అంటే...

"ఏమో నాయనా? ఏ దిక్కు, మొక్కు లేనివాళ్ళం. దైవం ఎందుకో మాపై కక్షబూనా దనిపిస్తోంది" గాద్గదికంగా

అంది అనసూయమ్మ.

"లేదు అనసూయమ్మగారు! కష్టంలో మనిషి చిత్తభ్రమ అది. దైవం ఎవరి పైనా కక్షబూనదు. దైవానికి తెలిసింది ఒక్కటే. అది సర్వప్రాణికోటిని సర్వవేళలా దయా కటాక్ష వీక్షణాలతో వీక్షించటం. మీరు అధైర్యపడకండి. మీరే ఇలా దీలాపడిపోతే, అమాయకురాలైన అనామికకు ఎవరు ధైర్యం చెప్తారు? అనామిక 'నిర్దోషి' అని నా మనసెందుకో గట్టిగా చెపుతోంది అందుకే, నా 'స్నేహమయి' 'పేదలపాలిట' 'ఆశాజ్యోతి' అయిన ప్రత్యూషను రమ్మనమని టెలిగ్రాం ఇచ్చాను. దైవం మేలు చేసి ప్రత్యూష ఊరిలో ఉంటే నా వార్త అందుకుని ఆఘమేఘాల మీద వచ్చి వాలుతుంది." ధృఢస్వరంతో అంటూన్న నా పలుకులు అనసూయమ్మగారిని ఉపశమించేలా చేశాయి

*　　　*　　　*


విమానంలోంచి దిగుతున్న ప్రత్యూషను చూడగానే నా హృదయం ఎగిరి గంతేసింది. నన్ను చూసి ప్రత్యూష చేయూపింది. బదులుగా చేయి ఊపాను.

మేం ఎక్కిన టాక్సీ బయల్దేరింది.

సీట్లో వెనక్కివాలి "చక్రధరం! నీ హడావిడి టెలిగ్రాం వివరాలేమిటి?" సూటిగా అడిగింది ప్రత్యూష.

చెప్పటం ప్రారంభించాను.

"ఒక ప్రముఖ సంస్థలో స్టెనోగా పని




చేస్తోంది అనామిక. అశోకనగర్ కాలనీలో నేను ఉంటున్న బంగ్లా ఎదురుగా ఉన్న పెద్ద పెంకుటిల్లు వాళ్ళది. అందులో అనామిక-ఆమె తల్లి అనసూయమ్మగారు ఉంటున్నారు. ఏ ప్రక్కనుంచీ మగదక్షత లేని జీవితం వారిది. అనామికకు తల్లే సర్వస్వం. గౌరవంగా గుట్టుగా సాగిపోతున్న వారి జీవననౌక చిన్నాభిన్నమైంది. విధి వక్రించి ఓ అర్ధరాత్రి అనామిక ఇంట్లో, ఆమె గదిలోనే హత్య జరిగింది. హతుడు అనామికకు పరిచయస్తుడే. ఈ మధ్యనే అతనితో ఒక ఒప్పందంమీద కాంట్రాక్టు వివాహం చేసుకుంది కాని వారిద్దరూ ఎవరికివారే. వేరు-వేరు చోట్ల జీవిస్తున్నారు. ఆ హత్య అనామికే చేసిందనటానికి కత్తిపై అనామిక వేలిముద్రలున్నాయట. ఇంకో ముఖ్య విషయం! ఈ నేరం తనే చేశానని ఒప్పుకుంటోంది అనామిక."

"వ్వాట్?! నేరా నిన్ను అంగీకరిస్తోందా?" ఆశ్చర్యంగా అడిగింది ప్రత్యూష.

"అవును ప్రత్యూష! అనామిక ఎందుకలా ప్రవర్తిస్తుందో నాకూ అర్థం కావటం లేదు. నేను ఎంత తరచితరచి ప్రశ్నించినా లాభంలేకపోయింది.

"అయితే కాంప్లికేటెడ్ కేసే!" సాలోచనగా అంది ప్రత్యూష.

"నే నలా అనుకోవటం లేదు" నవ్వుతూ అన్నాను.

"ఏం? ఎందుకని!"

"ఇంతకంటే కాంప్లికేటెడ్ కేసుల్ని గెలిచావు కనుక!"

"నా మీద చాలా నమ్మకం ఉందే!" సూటిగా చూసి అంది.

"అందుకే కదా నిన్ను రమ్మని కోరింది!" అనేసి "ఆఁ డ్రైవర్- లెఫ్ట్ సైడ్ దాబా దగ్గర ఆపు." అనగానే కీచుమని బ్రేకు శబ్దం చేస్తూ ఆగింది టాక్సీ.

ఇంట్లోకి వెళ్తూనే కుర్చీలో కూర్చుంది. "మిగతా వివరాలు కూడా త్వరగా చెపితే- ఆ తర్వాత ఎలా ప్రొసీడ్ అవ్వాల్సిందీ ఆలోచిద్దాం?" అంటున్న ప్రత్యూష వైపు ఓ క్షణకాలం చూస్తూ ఉండిపోయాను.

"ఏయ్! చక్రధరం నిన్నే. ఏమిటలా బిగుసుకుపోయావు?" పకపక నవ్వుతూ అడిగింది.

తెప్పరిల్లి "అబ్బే! ఏంలేదు. కనీసం ఇంట్లోకి వెళ్ళి ముఖం కడిగి కాఫీ అయినా..."

"మర్యాదలకేం గాని, ముందు అలా కూర్చో." ఆజ్ఞాపించింది.

ఎదురుగా ఉన్న ఖాళీ కుర్చీలో కూర్చోగానే...

"వివరంగా చూసింది చూసినట్లు చెప్పు!" అంది ప్రత్యూష

ఆ రాత్రి అనసూయమ్మగారు వచ్చి తలుపు తట్టడం దగ్గర్నుంచి ప్రారంభించాను.

* * *

ఆ మర్నాటి దినపత్రికలన్నీ "అనామిక తరపున ప్రత్యూష వకాల్తా" అన్న శీర్షికతో 'ఎమ్నెస్టీ ఇంటర్నేషనల్ మెంబర్- కుమారి ప్రత్యూష డిఫెన్స్ లాయర్‌గా కేసును చేపట్టబోతున్నారు' అని రాశాయి

అప్పుడే డ్రస్ చేసుకొని అటుగా వచ్చిన ప్రత్యూషను పిలిచి ఈ వార్త చదవగా విని నవ్వేసింది. మరుక్షణం లోనే గంభీరముద్ర వహించి...

"చక్రధరం! ఇపుడు ఎనిమిదయింది. మనం బయల్దేరి వెళ్ళి అనామికను కలుసుకోవాలి. సరిగ్గా పదిగంటకల్లా కోర్టులో అనామికను హాజరుపరుస్తారు

"ఇంతవరకూ మన దగ్గర సరైన వివరాలు, సాక్ష్యాధారాలు ఏం లేవు. కను మనం వేయబోయే ప్రతి అడుగు

జాగ్రత్తగా వేయాలి అందుకు అనామిక సహకారం ఎంతైనా అవసరం!" అగకుండా గబగబ చెప్పింది.

"నాదేం ఆలస్యంలేదు. పద వెళ్దాం!"

* * *

అనామిక జైలు గోడల మధ్యన, ముడిచిన మోకాళ్ళమధ్య తల వాల్చి, రెండుచేతులను మోకాళ్ళ చుట్టూ బంధించింది.

అనామికను ఆ పరిస్థితుల్లో అలా చూడగానే గుండె నీరైంది. అటువంటి దయనీయమైన దృశ్యం అంతకు మును పెన్నడూ చూసి ఎరుగని హృదయం మూగగా రోధించింది.

"అనామిక...!" నెమ్మది స్వరంతో పిలవగానే తలెత్తిచూసింది. రేగినజుట్టుతో పీక్కుపోయిన ముఖంతో, ఆ రెండు కళ్ళు ఎర్రబారి ఉన్నాయి.

"ప్రత్యూషను". నన్ను మార్చి మార్చి చూసింది అనామిక.

ఆ చూపులో ఎవరీమె అన్న సందిగ్ధత గోచరించింది.

"అనామికా! ఈమె పేరు ప్రత్యూష! నా స్నేహితురాలు." అని పరిచయం చేయగానే అప్రయత్నంగా రెండు చేతులూ జోడించింది అనామిక.

"అనామికా! ప్రత్యూష ప్రముఖ న్యాయవాది. మీ కేసును టేకప్‌చేయమని కోరాను. అదృష్టం బాగుండి ప్రత్యూష వేరే పనిలో లేకపోవడంతో వెంటనే వచ్చింది. దయచేసి జరిగింది జరిగినట్లు చెప్పండి. మీరు తప్పక విడుదల అవుతారు" ఆత్రంగా అంటున్న నా ముఖం లోకి వింతగా చూసింది అనామిక.

"నేను హత్య చేశాను. నేను శిక్షింపబడాలి" తలవంచుకుని గాద్గదికంగా అంది. వెంటనే ప్రత్యూష కలుగజేసుకుంటూ "అదే నిజమైతే మీకు శిక్ష ఖాయం. బట్. మీ ముఖంచూస్తే అలా అన్పించటంలేదు. హత్యచేసినవాళ్ళు మీలా ఏడుస్తూ కూర్చోరు. చేయని నేరాన్ని నెత్తిన వేసుకుంటే ఒక దోషి తప్పించుకుంటాడు" శాంత గంభీర స్వరంతో అంది ప్రత్యూష.

అనామిక దుఃఖాన్ని అపుకుని కళ్ళు తుడుచుకుంది.

"ప్రత్యూషగారు, ఎంతో దూరం నుంచి నన్ను కాపాడాలని వచ్చినందుకు కృతజ్ఞతలు. నేను నిర్దోషిగా విడుదలైనా సమాజం చూసే చూపులను, విసిరేమాటలను తట్టుకుని బ్రతికేకంటే - నేరస్తురాలిగా చట్టం చేతిలో చావటం మెరుగు!" అంది.

"అంటే దోషి ఎవరో తెలిసికూడా నిజాన్ని కప్పిపుచ్చటానికి ప్రయత్నిస్తున్నారా? లేక ఆ దోషికోసం మీరు త్యాగం చేస్తున్నాననుకుని బలికి సిద్ధపడుతున్నారా!" ప్రశ్నించింది ప్రత్యూష.

"నో!నా! దయచేసి నన్నేమీ అడగకండి ప్లీజ్!" రెండు చేతులూ ముఖం

మీద చేర్చి మరోసారి దుఃఖితురాలైంది అనామిక.

తేరుకుని, "చక్రధరంగారు నన్ను క్షమించండి. దురదృష్టవంతురాలిని కాపాడాలని మీరు తీసుకున్న శ్రమకు మరో జన్మంటూ ఉంటే మీ ఋణం తీర్చుకుంటా!" ఆగని దుఃఖాన్ని అదుపు చేసుకుంటూ ముగించింది అనామిక

ప్రత్యూష చేతి వాచీవంక చూసి 'చక్రధరం! పద వెళ్దాం. కోర్టుకి టైం అవుతోంది." అనగానే ఆమె చూపుల్లో భావాలను అర్థం చేసుకున్నవాడిలా మౌనంగా ముందుకు అడుగువేశాను.

జీపులో కూర్చున్నాక "చక్రధరం! అనామిక ఈ హత్య చేయలేదు" అంది.

ఆమె ముఖంలోకి చూస్తూ "నీకు ఎలా తెలుసు?" అనడిగాను.

"అనామిక ముఖం చూస్తే తెలుస్తోంది. ఆమె హృదయంలో తీరని గాయం అయింది. ఆ గాయం ఏమిటో తెలియాలి! ఓ. కే. మన ప్రయత్నం మనం చేద్దాం." ఆవి ఇంకేదో చెప్పబోతుండగా జిల్లాకోర్టు దగ్గరపడింది. అది చూసి "చక్రధరం! నన్ను ఇక్కడ దింపేసి-నువ్వెళ్ళి అనసూయమ్మగారిని వెంట బెట్టుకుని రా!" అంది. జీపు దిగగానే పత్రికా విలేఖరులు, అభిమానులు ప్రత్యూషను చుట్టుముట్టారు

ం ం ం

నిశ్శబ్దం ఆవరించిన కోర్టుహాలులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన కథనాన్ని సహజధోరణిలో కొనసాగించాడు.

ప్రత్యూష తన స్థానంలోంచి లేచింది: విజిటర్స్ గ్యాలరీలో గుసగుసలు మంద్ర స్థాయిలో వినిపించాయి. మేజిస్ట్రేట్ బల్లపై శబ్దం చేస్తూ 'ఆర్డర్-ఆర్డర్' అన్నాడు.

"మిలార్డ్!" ప్రాసిక్యూషన్ వారు ఆరోపించిన దాంట్లో నిజం ఎంతో నిరూపణ కావటాన్కి- అనామిక తరఫున లాయరుగా, అనామికను కొన్ని ప్రశ్నలు వేయటానికి అవకాశం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను" గంభీరమైన కంఠంతో సరళంగా అడిగింది.

"యస్! ప్రొసీడ్!" అన్నాడు మేజిస్ట్రేట్.

అనామికను బోనులో ప్రవేశపెట్టారు.

ప్రత్యూష ఆ బోను దగ్గరగా నడచింది. ప్రమాణంచేసిన గీతను ప్రక్కన ఉంచి,

"మీ పేరు" అంది ప్రత్యూష.

"అనామిక!" నెమ్మదిగా బదులిచ్చింది.

"మీరు ఏం చేస్తుంటారు?"


"స్టెనోగా పనిచేస్తున్నాను."

"ఎక్కడ?"

"ఈ ఊళ్ళోనే- 'కోడెక్స్' కంపెనీలో!"

"అనామిక! హంతకుడు మీకు తెలుసున్న వాడా?"

"అవును! మా ఆఫీస్‌లోనే పనిచేస్తు




న్నాడు, స్టోర్ కీపర్‌గా."

"ఐసీ! అతను - మీరు తరచుగా కల్సుకుంటూ ఉండేవారా?"

ఒక క్షణం మౌనం వహించి "అవును అప్పుడప్పుడు కల్సుకుంటుండేవాళ్ళం!"

"అచ్ఛా! అతన్ని మీరు హత్య చేసినట్లుగా కోర్టువారు నిర్ధారిస్తున్నారు. అందుకు మీరు అంగీకరిస్తున్నారా?".

"అవును!"

"బట్! నేను నమ్మను. ఈ హత్య మీరు చేయలేదంటాను!" తీవ్ర స్వరంతో అంది.

"కాదు! నేనే చేశాను!" ఖంగారుగా అంది.

"మీరే చేశారా? ఎలా చేశారు?" గబగబా అడిగింది.

"కత్తితో పొడిచి చంపాను!"

"కత్తితోనా? ఏ చేత్తో పొడిచారు!" వేగంగా మరో ప్రశ్న అడిగింది.

"కుడిచేత్తో. అహ!...!?" తడబడింది.

"దట్సాల్ యువరానర్! నోట్ దిస్ పాయింట్!" అంది ప్రత్యూష వెలుగుతున్న ముఖంతో.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముఖంలో రంగులు మారాయి.

"మిలార్డ్! ప్రాసిక్యూషన్ వారు ఆరోపించినదాంట్లో ముద్దాయి చేతి వేలి ముద్రలు లభించిన కత్తిపై -ఎడమచేతి వేలిముద్రలున్నాయని తెలిపారు. బట్! ముద్దాయి తానీ హత్యను కుడిచేతితో చేసినట్లుగా చెప్తోంది. దీన్ని బట్టి ముద్దాయిగా బోనులో నిలబడిన అనామిక అనబడే ఈమె- ఆ హత్య చేయలేదనేది రూఢిగా తెలుస్తోంది. సంఘంలో గౌరవంగా జీవిస్తున్న ఈమెపై ఎవరో

కావాలనే ఈ నేరాన్ని నెట్టటానికి యత్నించారు. ఘుద్దాయి భయపడిపోయి చేయని నేరాన్ని అంగీకరించి శిక్షకు సిద్ధపడి ఒక దోషిని తప్పించాలనుకుంటోంది. అసలు దోషి ఎవరో తెలుసుకునేందుకు కాస్త వ్యవధిని ఇప్పించవలసిందిగా కోర్టువారిని కోరుతున్నాను" అంటూ తన వాదనను ముగించింది.

"మిస్టర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్! మీరేమైనా ప్రశ్నించాలనుకుంటున్నారా?" మేజిస్ట్రేట్ అడిగాడు. "నో! సర్" అని లేచి నిలబడి చెప్పగానే కేసును వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించి కోర్టుహాలు వదిలి తన ఛాంబర్‌లోనికి నడిచాడు మేజిస్ట్రేట్. అంతవరకు ఊపిరి బిగపట్టి కేసు వివరాలు వింటున్న విజిటర్స్ గ్యాలరీలో చలనం వచ్చినట్లు గుసగుసలు మిన్నుముట్టాయి. అనామిక తల్లి వైపు దృష్టి సారించి తల దించుకుంది.

మరు నిముషంలో కోర్టుహాలు ఖాళీ అయింది.

"బాబూ చక్రధరం! నాకు వినబడదు. జడ్జిగారు ఏం చెప్పారో కాస్త వివరించు నాయనా!" అని అర్థించింది.

"కేసు వాయిదా వేశారు అనసూయమ్మగారు. ప్రత్యూష ఈ కేసు తప్పక గెలుస్తుంది. అనామిక విడుదల అవుతుంది." ఆనందంగా చెప్పాను.

"చల్లని కబురు చెప్పావు? నువ్వే కనుక పూనుకోకపోతే ఈపాటికి దాని ప్రాణాలు తీసేవారు నాయనా! భగవంతుడు నీకు మేలు చేస్తాడు." అనసూయమ్మగారి గొంతు అపైన పెగల్లేదు. ఇంతలో ప్రత్యూష దగ్గరగా వచ్చింది ప్రశంసా దృక్కులతో ప్రత్యూష వైపు ఒకసారి చూసి ముందుకు నడిచాను.

* * *

ఆ రోజు వాయిదా......

మునుపుకంటె ఎక్కువ జనంతో కోర్టుహాలు, గ్యాలరీ నిండిపోయింది. ఇంకా కొద్దిమంది వరండాలోనే నిలబడాల్సి వచ్చింది. ఆ జనంలో అనామిక ఆఫీస్‌స్టాఫ్ కూడా ఉన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి కేసు పూర్వాపరాలు చదివి- అనామికను ఏవో కొన్ని ప్రశ్నలడిగాడు.

ప్రత్యూష లేచింది తన స్థానంలోంచి.

"మిలార్డ్! అనామికను కొన్ని ప్రశ్నలడగటానికి అనుమతించవలసిందిగా కోరుతున్నాను."

"యస్! ప్రొసీడ్!" అనగానే;

"అనామిక! ఆ రోజు అనగా 6-6-80 రాత్రి హతుడు ఎన్ని గంటలకు వచ్చాడు."

"ఆ! ఆ రోజు. ఆ రోజు......" ఖంగారు పడుతోంది, అనామిక.

"ఖంగారు లేదు. ఆలోచించి చెప్పండి." సౌమ్యంగాఅంది ప్రత్యూష.

"ఆ రోజు రాత్రి పన్నెండు దాటిం దనుకుంటాను" తల వంచుకునే చెప్పింది.

"అంత రాత్రిపూట ఎందుకు వచ్చి నట్లు? అంతకు మునుపు అలా వచ్చే అలవాటుందా అతనికి?"

"లేదు-ఎపుడూ రాలేదు. ఆ రోజే అతను వచ్చింది..." అని అర్ధోక్తిగా ఆగిపోయింది.

"ఆఁ... అతను వచ్చింది...?" రెట్టించింది ప్రత్యూష.

"ఆ మర్నాడు అంటే 6-6-80 తేదీన ఉదయాన్నే ఊరు వెళ్ళాల్సిన పని ఉందని, రావటానికి ఆలస్యం అవుతుందని చెప్పటానికి వచ్చాడు."

"ఆ తర్వాత-?

"వాతావరణం- ఒంటరితనం చూసి కోరిక మీర బలవంతం చేయ బోయాడు... వద్దని వారించాను."

"అతను వచ్చినపుడు మీరు ఆ రాత్రిపూట ఏం చేస్తున్నారు?"

"నేనాఁ! కూర్చుని డైరీ వ్రాస్తు న్నాను..."

"మీకు డైరీ వ్రాసే అలవాటు ఎంత కాలంగా ఉంది?"

గత మూడేండ్లుగా ఉంది!

"మిలార్డ్! ముద్దాయిగా ఆరోపించ బడిన నా క్లయింట్ అనామిక ఏ కారణాలవల్లనో నిజాన్ని నోటితో చెప్ప లేకపోతోంది. హతుడు ఆ అర్ధరాత్రి రాక కారణం వేరై ఉండవచ్చునేది నిస్పందేహం! మనిషిగా మరో మనిషితో పంచుకోలేని భావాలను, బాధలను వ్యక్తి తన డైరీల్లో వ్రాసుకుని తృప్తిపడ తాడు; కనుక అనామిక గతం ఏమిటో హతునికి ఆమెకుగల సంబంధ-బాంధవ్యా లెటువంటివో తెలియాలంటే అనామిక డైరీ ఈ కేసులో ఉపకరిస్తుందని భావిస్తూ- ఈ డైరీని పరిశీలించవలసిం దిగా కోర్టువారిని కోరుతున్నాను." అంటూ ఒక నీలంరంగు డైరీని బెంచి క్లర్క్-ద్వారా మేజిస్ట్రేట్‌కు అందిం చింది.

అనామిక ముఖం కళవెళబోయింది. గ్యాలరీలో మనుషుల ముఖాల్లో ఏదో నూతనోత్సాహం కొట్టొచ్చినట్లు అగు పించింది. గుసగుసలు-హర్షాతిరేకాలు-రణగొణ ధ్వనితో హాలు నిండిపోయింది. కేసును వారం రోజులు వాయిదావేశారు.

* * *

అనామిక పర్సనల్ డైరీని డూప్లి కేటింగ్ కాపీలు తీయించి ఒరిజినల్ డైరీని మేజిస్ట్రేట్‌గారికి, మరో కాపీని ప్రత్యూషకు ఇచ్చి నా దగ్గర ఒక కాపీని ఉంచాను. రాత్రి భోజనం అయ్యాక ప్రత్యూష తన గదిలోకి వెళ్ళగానే- డైరీని తీసుకుని డాబాపైకి చేరాను. కుర్చీలో వాలిపోయి ఆత్రంగా తెరిచాను. జనవరి నెలనుంచి ప్రారంభమైన డైరీలో పేజీలను తిరగేస్తూ పోతూంటే

ఒక తారీఖు దగ్గర రెడ్ ఇంక్‌తో మార్క్ చేయబడి ఉండటంతో కళ్ళు అప్రయత్నంగా అక్కడే ఆగిపోయాయి.

12-09-1985: చాలా ఆశ్చర్యకరమైన రోజు. ఎడమవైపున భాస్కరం మేడ ఉంది. భాస్కరం తల్లికి డబ్బు పిచ్చి. ఒక్కడే కొడుకు. తండ్రి లేడు. రెండు లక్షలరూపాయలకు కిమ్మత్తుచేసే మేడ ఇతర ఆస్తిపాస్తులున్నాయి. అంత ఆస్తికి వారసుడైతే అయ్యాడు గాని మూగవాడు. డెఫ్ అండ్ డంబ్ స్కూల్లో చదువుకున్నాడు. ఆ భాస్కరం ప్రేమలేఖ వ్రాశాడు. మనిషికి మంచి రూపాన్నైతే ఇచ్చాడా దేవుడు. మాట నివ్వలేదు. మనిషి మూగ అయినంత మాత్రాన మనసుమూగ కానక్కరలేదుగా. నన్ను అమితంగా ఆరాధిస్తున్నాడంట. నా ఒప్పందంమీద పెళ్ళికి కూడా సిద్ధమేనట. కట్నకానుకలు నా అంగీకారమేనట. డబ్బుకు- ప్రాణానికి లంకె ఉన్న భాస్కరం తల్లికి ఈ విషయం తెలిస్తే ఇంకేమైనా ఉందా? నానామాటలూ అని నలుగురిలోనూ పడెయ్యదూ? పిచ్చి భాస్కరం! ఆదర్శవంతమైన నీ మనసుకు మాట తోడైతే బాగుండేది. నీ మూగతనమే నీకు లోపమని నువ్వనుకుంటున్నావు. మాట్లాడగలిగే- మనసు రాయి చేసుకుని కట్నకానుకలను ఆశించే మగవారిని- మనసులేని మూగ అనుకుంటున్నాను.

29-03-1985: ఆఫీస్‌కు ఆలస్యంగా వచ్చాడని కిరీటిని బాస్ మందలించాడు. సెక్షన్స్ వేరైనా బాస్ ఒక్కడే కావటంతో ఆఫీస్ కష్టాలు ఒకరితో ఒకరు పంచుకుంటూంటారు. ఆ విషయాన్ని పునస్కరించుకుని బస్ స్టాపులో సాయంత్రం పలకరించి బస్ వచ్చేవరకు మాట్లాడుతూనే ఉన్నాడు. మాట్లాడుతున్నంత సేపూ అతని చూపులను తట్టుకోవటం కష్టమైంది. కిరీటి చూపులకే నోరుంటే నా శరీరంలో సగభాగం ఖాళీ అయిపోయేదేమో?

15-04-1985: భాస్కరం నా నుంచి జవాబును ఆశిస్తూ మరో ఉత్తరం వ్రాశాడు. కాని ఎందుకో జవాబు వ్రాయలేకపోయాను.

28-05-1985 : కిరీటి 'బర్త్‌డే'కని ఇంటికి ఆహ్వానించాడు. అంతా వస్తున్నారు అని చెప్పాడు. నిజమేననుకుని వెళ్ళిచూస్తే ఎవ్వరూ లేకపోవటంతో కాస్త కంగారుపడ్డాను. ఆర్భాటం చేయటం ఇష్టంలేక ఎవరికీ చెప్పలేదనీ, ఎవరూ రావటంలేదని చెప్తే నేనూ రాననే భయంతో అంతా వస్తున్నారని అబద్ధం చెప్పవలసి వచ్చిందనీ చెప్పాడు. అక్కడున్నంత సేపు పల్లేరుకాయల మీద నిలబడినట్లు అనిపించింది. వచ్చేస్తూంటే అతనడిగిన ఆఖరి ప్రశ్న. బర్త్‌డే ప్రజెంటేషన్‌గా నా మనసు కావాలని అడగటం! ఎదురుచూడని

ప్రశ్నేమో- జవాబు ఇవ్వలేకపోయాను.


1-6-1985: ఆకాశం నిర్మలంగా ఉంది. ఎన్నివేల తారలున్నా వెలగని నింగి ముఖం చంద్రరేఖను చూడగానే ఫక్కున నవ్వినట్లయింది ముందుగా వీచే పిల్లగాలులు 'నైట్‌క్వీన్' ప్లాంట్ మంచి సువాసనలను మోసుకువచ్చి మనసును ఆహ్లాదపరుస్తున్నాయి. హాయి గొలిపే ఆ వాతావరణంలో ఆకాశ 'వీధి వంక చూస్తూ...అలా...అలా దృష్టి భాస్కరం మేడవైపు మళ్ళింది. ఆ మేడపైన కిటికీ దగ్గర కూర్చుని భాస్కరం ఇటే చూస్తున్నట్లనిపించి హృదయం బరువెక్కింది.

02-06-1985 ; ఇంట్లో పడుకుంటే ఫాన్‌గాలి పడకపోవటంతో ఆరుబయట ప్రక్కలు వేశాను. ఎందుకనో నిద్ర పట్టటం లేదు. ఎప్పుడో అర్ధరాత్రి మాగన్ను పట్టింది. రెండో జాములో ఉండగా ఏదో శబ్దం వినిపించింది. ఎవరో గోడ దూకిన శబ్దం. శరీరం నిద్రావస్థలో ఉన్నా మనసు మేల్కొనే ఉంది. మెదడు శబ్దాలను రిసీవ్ చేసుకుంటుంది. ఎవరో నెమ్మదిగా నడుస్తూ మంచం దగ్గరగా వచ్చి నిలబడ్డారు. కళ్ళు తెరవాలంటే ఏదో తెలీని భయం ఆవహించింది. ప్రక్కనే ఉన్న అమ్మ మంచం వైపు చెయ్యి చాపాలనుకున్నాను. కాని నిర్జీవమైనట్లు కదలలేదు చెయ్యి. శరీరం అంతా ముచ్చెమటలు పోశాయి. ఆ ఆకారం ముందుకు వంగి ముఖానికి చేరువౌతోంది. ఆ ఆకారం ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నా ముఖాన్ని తాకుతున్నాయి. అది కలకాదు వాస్తవం. ఏదో జరుగబోతోంది. ఏం జరగబోతోందో తెలిసేసరికి-శరీరం కట్టెలా బిగుసుకుంది. నాలో ఊపిరి స్తంభించింది. గుండె బరువుగా కొట్టుకుంటోంది. ఎవరో కావాలనే చేస్తున్నారు...ఎవరు? ఎవరది... ఎవ...ఎ అని అరవాలనుకున్నాను. కాని అప్పటికే ఆలస్యమైంది. ఆ ఆకారం వామహస్తం అరవాలనుకున్న నా నోటిపై పడింది. గొంతులో మాట పైకిరాలేదు గట్టిగా అరిస్తేగాని అమ్మకు వినబడదు. నిశ్చింతగా నిద్రపోతోంది అమ్మ. నాపై పూర్తిగా ఆక్రమించుకున్న బరువును ప్రతిఘటిస్తూ చేతుల్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నాను. ఆ ఆకారం మెడచుట్టూ నా చేతులు బిగుసుకున్నాయి. ఆ ఆకారం గింజుకుంటోంది. పదునైన నా గోళ్ళు అతని కంఠంలో దిగబడ్డాయి. నిద్రలోనే అమ్మ కదలికలు వినిపించి కళ్ళు తెరిచాను. నా నుంచి ఆ ఆకారం ఒక్కక్షణం వేరై ప్రహరీవైపు పరుగెత్తి ఛెంగున అవలివైపు గెంతి మాయమైంది. అంతవరకు భయంతో నెమ్మదిగా కొట్టుకొంటున్న గుండె వేగం హెచ్చింది. అప్రయత్నంగా మంచందిగి ప్రహరీవైపు పరుగెత్తాను. ఇనుప తలు

పులు-ఎత్తైన గోడ అవతల ఎవరో ఏవరితోనో తలపడుతున్నారు. వీధి తలుపు తాళంవేసి ఉండటంవల్ల గేటు తీసే అవకాశం లేదు. గోడను అందుకోవాలంటే ఎత్తుచాలదు. వెంటనే గోడవార ఇటుకలను ఒకదానిపై ఒకటి చేర్చి గోడ అంచు అందుకున్నాను. అవతలి వైపు శబ్దాలు ఆగిపోయాయి. ఒక ఆకారం ఎదురింటి వైపు వెళ్ళి లోపలకు ప్రవేశిస్తోంది. అతను... అతను చక్రధరం!?

03-06-1885 : రాత్రి చూసిందాన్ని బట్టి చక్రధరం ఈ పనిచేశాడని- అతనింటికి వెళ్ళాను. వెళ్తూనే నా బాధని కోపం రూపంలో ప్రదర్శించి వీరావేశం ఎత్తిపోతూంటే నవ్వుతూ అంతా విన్నారు. అతన్ని మాటలతోనే కాక చేతలలో కూడ అవమానించాను. మెడ మీద రక్కులుంటాయనే అనుమానంతో షర్ట్ విప్పించాడు. అంతా జరిగాక తాపీగా నా దగ్గరగా వచ్చి, చేతిలో నల్లని మనీ పర్సును ఉంచారు. దాన్ని తెరిచి చూసి అప్రభుతిరాలనైనాను. చక్రధరం రాత్రి నిద్రరాక- లైటు ఆర్పి వరండాలో కూర్చుని ఉండగా ఎవరో గోడ ఎక్కి ఇవతలకు దూకటం చూసి ఒక్కపరుగున వెళ్ళి కలయబడటంతో ఆ పర్సు జారి పడిందట. పోలీస్ కంప్లైంట్ ఇవ్వటానికి బయల్దేరబోతుంటే నేనూ వెళ్ళాను. కేసు బుక్ చేస్తే ఏమీ లేనిదాన్ని గోరంతలు-కొండొంతలు చేసి ఇరుగుపొరుగు చెప్పుకుని చెవులు కొరుక్కుంటూంటే చూసి భరించేశక్తి నాకు లేదని అతనికి నచ్చచెప్పాను. నా తొందరపాటుకు క్షమార్పణలు చెప్పుకుని ఇంటికొచ్చాను. అమ్మకేమీ తెలియనివ్వలేదు. అందుకనే అంటారేమో 'కళ్ళతో చూసిందంతా నిజము కాదు- చెవులతో విన్నదంతా నేరమూ కాదని!'

04-06-1985 : కిరీటిని కలిసి, అతని పుట్టినరోజు కానుకను ఈ రోజు ఇవ్వటానికి సిద్ధమై వచ్చానని చెప్పాను కాని అందుకతను సిద్ధంగా లేనని చెప్పాడు. అయితే జైలుకు వెళ్ళటానికి సిద్ధంగా ఉండమని చెప్పడంతో ఖంగు తిన్నాడు. అతని బండారమంతా బైట పెట్టడానికి తగిన సాక్ష్యాధారాలు నా దగ్గరున్నాయన్నాయని చెప్పగానే కళ వళపడ్డాడు. గతరాత్రి జరిగింది జరిగినట్లుగా ఒక తెల్లకాగితంపై వ్రాసి ఇమ్మనగానే-అది జరగని పని అన్నాడు అయితే జరిగే పనికి బాధ్యత వహించమన్నాను. బ్లాక్ మెయిల్ చేస్తున్నానని అన్నాడు. అంతకంటే ఘోరమైన పని-ఒక స్త్రీ జీవితాన్నే చీకటి చేయబోయావని తీవ్రంగా అనటంతో మౌనం వహించాడు. చివరికి కాగితం వ్రాసి ఇచ్చాడు. రేపన్నరోజు ఆ కాగితామే నా లైఫ్ సెక్యూరిటీ అని చెప్పి వచ్చేశాను. చక్రధరం గారికి విషయం చెప్పగానే-'కిరీటితో వివాహం పాముతో చెలగాటం'




అని సలహా ఇచ్చారు. అటువంటి విష సర్పాలు సమాజంలో నాలాటి మరో స్త్రీ జీవితాన్ని కాటువేయకుండా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా చెప్పాను.

06-06-85; రాత్రి ఎంతకూ నిద్ర పట్టటం లేదు సుడిగుండంలో చిక్కిన చేపపిల్లలా అయింది జీవితం. గదిలో కూర్చున్న నా ఎదుట గోడకు గాంధీజీ పటం వ్రేలాడుతోంది. అందులో ఆయన చెరగని చిర్నవ్వులు చిందిస్తున్నాడు. బాపూజీ కన్నకలలలో స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలొకటి. 'ఏనాడైతే స్త్రీ నిర్భయంగా నిశిరాత్రి నిర్జన ప్రదేశంలో కూడా సంచరించగలదో-ఆనాడు మనకి పూర్తి స్వాతంత్రం వచ్చినట్లని' నుడివా రాయన. కాని నాలాటి మగదక్షత లేని 'స్త్రీ' కి సభ్యసమాజంలో నాలుగు గోడలమధ్యనే రక్షణ కరువైనపుడు బాపూజీ కలలు నిజమయ్యేదెపుడు? సమాజంలో 'స్త్రీ'కి విలువ పెరిగి ప్రగతి సాధించే దెప్పుడు?...... అక్కడినుంచి అలికేసినట్లు వ్రాసిన అక్షరాలు అర్థం కాలేదు. బహుశ ప్రత్యూష కూడా ఈ మేరకు చదివి ఉండాలి. ఏదైనా సలహా ఇస్తుందనే ఉద్దేశ్యంతో ఆమె గదివైపు వెళ్ళాను.


* * *

క్రిరీటి హత్య నగరంలో సంచలనం కలిగించటంకంటే అనామిక తరఫున ఇంటర్నేషనల్ అమ్నెస్టీ మెంబర్-పి.యు.సి.ఎల్ ఎవార్డ్ విన్నర్ కుమారి ప్రత్యూష వకాల్తా పుచ్చుకుని వాదించటం మరింత ఉత్సుకతను రేకెత్తించింది ప్రజల్లో.

○ ○ ○

ఆ రోజు ఆఖరి తీర్పువిచ్చే రోజు. కోర్టుహాలు నిశ్శబ్దంగా ఉంది. మేజిస్ట్రేట్ గొంతు సవరించుకున్నాడు. ఎంతో శ్రద్ధగా కూర్చున్నవారిలో నేనూ ఉన్నాను. మేజిస్ట్రేట్ మొదలుపెట్టాడు.

"హతుడు కిరీటి హత్యకేసులో వాదోపవాదాలు విన్నమీదట, లభించిన సాక్ష్యాధారాలను బట్టి, హతుడు కిరీటి, గతంలో రెండుసార్లు అర్థరాత్రి సమయంలో ముద్దాయిగా ఆరోపించబడిన అనామిక అనబడే స్త్రీపై అత్యాచారానికి పూనుకున్నాడని నిర్ధారణ అయింది. హతుడు కిరీటిని చట్టానికి అప్పగించకుండా అతనిలో సత్ప్రవర్తననాశించి కిరీటిని వివాహం చేసుకోవాలని నిశ్చయించుకుంది అందుకు కిరీటి వ్యతిరేకత చూపించగా నేరానికి శిక్ష అనుభవించేందుకు సిద్ధంకమ్మని హెచ్చరించింది. గౌరవ మర్యాదస్తుడిగా సభ్య సమాజంలో నటిస్తున్న కిరీటి చట్టానికి చిక్కితే ప్రమాదమని అనామిక కోరిన విధంగా వ్రాసి ఇచ్చాడు కాని ఆ కాగితాన్ని దొంగిలించాలనే ప్రయత్నంలో హతుడు కిరీటి తేదీ 08-06-85 రాత్రి పన్నెండుగంటల పదినిమిషాలకు అనామిక ఇంట్లో జొరబడ్డాడు. ఆ రాత్రి అనామిక నిద్రరాక డైరీని వ్రాసుకుంటుండగా కిరీటిఅనామికకు కత్తిచూపి బెదిరించాడు. ఆ కాగితాన్ని ఇవ్వమని అడిగాడు. అదే సమయంలో ప్రక్క ఇంట్లో ఉన్న ఉలివల భాస్కరం అనే వ్యక్తి హఠాత్తుగా లోపలకు జొరబడి హతుడైన కిరీటిపైకి లంఘించాడు. ఆ పెనుగులాటలో ఆవేశపూరితుడైన భాస్కరం కిరీటి చేతిలోని కత్తితో కిరీటిని పొడిచాడు. ఆ కత్తిని అచేతనంగా నిలబడిపోయిన అనామిక చేతిలోఉంచి తనదారిన తాను వెళ్ళిపోయానని ఉలివల భాస్కరం తన స్వహస్తాలతో వ్రాసి ఇచ్చిన వాఙ్మూలాధారంగా తేలింది. నేరస్తుడు తానేనని అంగీకరిస్తున్న ఉలివల భాస్కరం అనబడే ముద్దాయి మూగవాడైన కారణంగానూ, ఈ నిజాన్ని చట్టం దృష్టికి తేలేకపోయానని అదే వాఙ్మూలంలో తెలియపరిచాడు. ఒక 'స్త్రీ' ని కాపాడాలనే ఆత్రంలోనైతేనేమీ ఆవేశంలోనైతేనేమీ కిరీటిని హత్యచేసినందుకుగాను భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 302 ప్రకారం యావజ్జీవ కారాగార శిక్షను విధించడమైనది. నేరాన్ని కప్పిపుచ్చాలనేప్రయత్నంచేసిన ఉలివల భాస్కరం తల్లి అయిన ఉలిమల భానుమతికి రెండేళ్ళ కఠిన కారాగారశిక్షను విధించడమైనది. ఈ కేసులో ఇంతవరకూ నింధితురాలిగా అనుమానించిన అనామికను నిర్దోషిగా విడుదల చేయుటమైనది." తీర్పును చదవడం ముగించి మేజిస్ట్రేట్ అతని ఛాంబర్‌వైపు వెళ్ళగానే హాలంతా ఆనంద హర్షాతిరేకాలతో పత్రికావిలేఖరుల ప్రశ్నల పరంపరలతో



ఫ్లాష్ వెలుగులతో నిండిపోయింది.

మర్నాడు పత్రికలన్నీ ప్రత్యూష ఫోటోతో సహా 'ప్రత్యూష విజయం- నిర్దోషి విడుదల' అని తీర్పు వివరాలు ప్రకటించాయి.

ఆ రోజు అనామిక తల్లికి పండుగలా వుంది. అనామిక ఆఫీస్ స్టాఫ్ అంతా వచ్చి పరామర్శించి, ప్రత్యూషకు ప్రశంస లందచేసి వెళ్తున్నారు.

ఆ రాత్రి భోజనాలైనాక ప్రత్యూష తిరుగుప్రయాణానికి సంసిద్ధమైంది.

అనసూయమ్మగారు ఆనందోత్సాహాలతో హారతులు పట్టింది ప్రత్యూషకు.

దేవదూతగా వచ్చి, న్యాయదేవతను రక్షించి వాయుదూత్‌లో ఎగరబోతోంది ప్రత్యూష. ఎయిర్‌పోర్టుకు అనామిక వచ్చింది. నా ప్రక్కనే నిలబడి చేతిని ఊపుతున్న అనామిక ముఖంలో క్రొంగొత్త కళ గోచరిస్తోంది. ఆనందభాష్పాలు నిండిన కళ్ళతో వీడ్కోలు ఇచ్చింది అనామిక. నేనూ చేతిని గాల్లో ఊపాను. న్యాయదూతగా పదికాలాలపాటు పచ్చగా ఉండమని మనసారా దీవించాను.

వాయుదూత్ కదిలింది కనులముందు అనంతాకాశంలో ప్రయాణిస్తోంది. *